సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం : 20 : ఫిబ్రవరి : 2023



ముహూర్తమెప్పుడో?
ఉమ్మడి జిల్లా రైతుల ప్రయోజనాల కోసం బుగ్గపాడులో ఏర్పాటు చేసిన ఫుడ్‌పార్క్ ప్రారంభానికి నోచుకోవడంలేదు. 8లో



వలసొచ్చి.. అండగా నిలిచి !
సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీలు ఏటా వలస వస్తున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
37° / 20°

వాతావరణం
జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది. రాత్రి వేళ కొంతమేర చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



స్వామి వారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో మూలమూర్తులకు ఆదివారం సందర్భంగా అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం గావించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు.

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: శ్రీకనకదుర్గమ్మతల్లికి అర్చకులు విశేష పూజలు, అభిషేకం జరిపారు. ఆదివారం పెద్దమ్మతల్లి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఒడిబియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు.

నేడు ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి అశోకచక్రవర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను లిఖిత పూర్వకంగా అందజేయాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'యువజన' వేడుకలకు పయనం..



సమ్మేళనానికి బయలుదేరుతున్న యువత

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏజెన్సీ నుంచి యువతీ యువకులు ట్రైబల్ యూత్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమానికి బయల్దేరారు. ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు వారణాసిలో, ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకు ముంబాయిలో జరగనున్న కార్యక్రమాలకు 40 మంది విద్యార్థులు ఆదివారం భద్రాచలం నుంచి బయల్దేరి వెళ్లారు. వీరు సుమారు వారం రోజులపాటు అక్కడి సంస్కృతి, భాష, జీవనశైలి, విద్యామార్గాలు, అభివృద్ధి కార్యకలాపాలు తదితర అంశాలపై అధ్యయనం చేయనున్నారు. యువతకు వస్తు సామగ్రి సమకూర్చడంతోపాటు వారితో కొందరు సీఆర్‌పీఎఫ్ అధికారులు వెళ్తున్నారు. కాగా ఈ నెల 7న లక్నోలో జరిగిన యువజన సమ్మేళంలో మొదటి బహుమతి సాధించిన శిరీష, జహ్నవి, శ్రీలత్‌లను అధికారులు అభినందించారు. 141 బెటాలియన్ సీఆర్పీఎఫ్ కమాండెంట్ ప్రశాంత్ ధర్, కమల్వీర్ యాదవ్, లతిక్ కుమార్, సాహు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎల్ఈడీ పరీక్ష కేంద్రం మార్పు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 22వ తేదీ నుంచి నిర్వహించే డీఎల్ఈడీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) పరీక్షల కేంద్రాన్ని మార్చినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ఎస్ఎస్.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు గతంలో ప్రకటించామని, కానీ వివిధ కారణాలతో పరీక్ష కేంద్రాన్ని బాబుక్యాంపు ఉన్నత పాఠశాలకు మార్చామని పేర్కొన్నారు. అభ్యర్థులు గమనించాలని, పూర్తి వివరాలకు 99890 27943 నంబరులో సంప్రదించాలని కోరారు.

సామాన్య భక్తులకు
తలదాచుకునే చోటేది?

భద్రగిరిలో సరిపడా లేని వసతి గృహాలు
- పుణ్యక్షేత్రంలో దేవస్థానం గదుల నిర్వహణ ప్రైవేట్‌కు..
- నవమికైనా టీటీడీ సత్రం అందుబాటులోకి వచ్చేనా?



రాత్రివేళలో కరకట్టపైనే నిద్రిస్తున్న భక్తులు (ఫైల్)

భద్రాచలం: అందరి బంధువైన శ్రీ సీతారామయ్య సన్నిధిలో ఉత్సవాల వేళ సామాన్య భక్తులకు ఇక్కట్లు తప్పడంలేదు. ఏటా శ్రీ సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలకు వచ్చే వారికి తలదాచుకునే చోటు దొరకడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు వసతి, సౌకర్యాలు కల్పించడంలో దేవస్థానం అధికారులు విఫలమవుతున్నారు. శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో వచ్చే నెల 30, 31వ తేదీల్లో శ్రీ సీతారాముల కల్యాణం, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. సుమారు లక్ష మంది భక్తులు వస్తారనే అంచనాతో అధికారులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు.

అందుబాటులో 50 గదులే..

ప్రతి పుణ్యక్షేత్రంలో దేవస్థానం సత్రాలు, కాటేజీలు, వసతి గృహాల్లో భక్తులు వసతి పొందుతుంటారు. కానీ భద్రాచలంలో మాత్రం వసతి కోసం ప్రైవేట్ లాడ్జీలు, రెస్టు రూంలను ఆశ్రయించక తప్పదు. దేవస్థానం ఆధ్వర్యంలో రంగనాయకుల గుట్టపైనే సుమారు 28కు పైగా కాటేజీలు ఉన్నా ప్రస్తుతం 10 కాటేజీలు మాత్రమే వినియోగంలో ఉన్నాయి. వీటిలో ఐదు దాతల సౌజన్యంతో వారి ఆధ్వర్యంలో నిర్వహించేవే ఉన్నాయి. మిగిలిన 18 కాటేజీల వరకు శిథిలావస్థకు చేరాయి. ఇక దేవస్థానం పరిధిలో గతంలో సుమారు 150 గదులు ఉండగా, ప్రస్తుతం కేవలం సుమారు 50 గదులు మాత్రమే ఉన్నాయి. 100 గదుల వరకు నిర్వహణను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు.

గుట్టు చప్పుడు కాకుండా ప్రైవేట్‌కు..

గతంలో దేవస్థానం ఆధ్వర్యంలో సీతానిలయంలో 30 గదులు కరకట్టకు దిగువన ఉండేవి. వీటిని చక్ర సిమెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించే విధంగా అప్పచెప్పారు. ఇటీవల వరకు శ్రీరామనిలయంలో 62 నాన్ ఏసీ, ఏసీ గదులు భక్తులకు పెద్ద ఎత్తున సేవలను అందించేవి. వీటిని సైతం నిర్వహించలేమంటూ ఇటీవల గుట్టు చప్పుడు కాకుండా ప్రైవేట్ యాజమాన్యానికి కట్టబెట్టారు. దీంతో ఇవి దేవస్థానం పరిధి నుంచి చేజారిపోయాయి. వసతి గృహాలను, గదులను పెంచకపోగా, ఉన్నవాటిని ఏకపక్షంగా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక రంగనాయకుల గుట్టపైనే టీటీడీ ఆధ్వర్యంలో పూర్వకాలంలో నిర్మించిన సుమారు 30 గదులు పూర్తి శిథిలావస్థలో ఉన్నాయి. వీటి స్థానంలో నూతన వసతి గృహాల నిర్మాణానికి దేవస్థానం అధికారులు చొరవ చూపటంలో విఫలమవుతున్నారు. సీఆర్ఓ ప్రాంగణంలో 32 గదులతో చేపట్టిన జానకీ సదనం నిర్మాణంలో ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది.

ప్రైవేట్ లాడ్జీల్లో ఇష్టారీతిన ధరలు

ఉత్సవాల సమయంలో దేవస్థానం గదులు అందుబాటులో లేకపోవడంతో భక్తులు ప్రైవేట్ గదులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్ యాజమానుల ఆధ్వర్యంలో నడుస్తున్న లాడ్జీలలోని ముప్పావు వంతు గదులను రెవెన్యూ శాఖ తన ఆధీనంలోకి తీసుకుంటుంది. ఉన్న కొద్దిపాటి గదులు మాత్రమే ప్రైవేటు లాడ్జీల యజమానుల చేతుల్లో ఉంటాయి. దీంతో వారు ఇష్టానురీతిన అద్దె వసూలు చేయటం పరిపాటిగా మారింది. గత ఏడాది ఒక్క గదికి సుమారు రూ.10 వేల నుంచి రూ. 20 వేల వరకు వసూలు చేశారు. భక్తుల జేబులను లూటీ చేశారు. ఈ ఏడాది శ్రీరామనవమితో పాటు 12 ఏళ్లకోసారి వచ్చే సహస్ర పుష్కర పట్టాభిషేకంతో భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో వసతి సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

భక్తుల కష్టాలు తీరేదెప్పుడో..?

దక్షిణ అయోధ్యగా దేశంలో భద్రాచలానికి ప్రముఖ స్థానం ఉన్నా భక్తులకు వసతి కల్పనలో మాత్రం చిట్టచివరి స్థానంలో నిలుస్తోంది. ఉత్సవాల సమయంలో ప్రధానంగా సామాన్య భక్తులే ఇక్కట్లు పడేది. ఇటు దేవస్థానం గదులు లేక, అటు ప్రైవేట్ లాడ్జీలలో గదుల వ్యయాన్ని భరించలేక.. భూమి తల్లినే పూలపాన్పుగా భావిస్తూ కటిక నేల మీద నిద్ర పోయే దృశ్యాలు ఉత్సవాల వేళ కనిపిస్తుంటాయి. రాత్రి వేళలో విషపురుగులు తిరుగుతున్నా లెక్క చేయకుండా కరకట్ట దిగువన, గోదావరి ఒడ్డున భక్తులు సేద తీరుతుంటారు. వీటికి పుల్‌స్టాప్ పెట్టి శాశ్వత చర్యలు చేపట్టాల్సిన ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు మాత్రం ఏసీ గదుల్లో ప్రొటోకాల్‌తో విలాసంగా విశ్రాంతి తీసుకుంటూ ఉంటారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



సీఆర్ఓ ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న సదనం

నిర్మాణం పూర్తయినా...



టీటీడీ ఆధ్వర్యంలో సీఆర్ఓ కార్యాలయం వెనుక 3 డార్మెటరీ హాల్స్, ఒక కల్యాణ మండపం, 32 గదులతో నిర్మించిన సత్రం పూర్తయినప్పటికీ దేవస్థానానికి అందచేయలేదు. గత శ్రీరామనవమి నుంచి అదిగో..ఇదిగో అంటున్నా అందుబాటులోకి రాలేదు.

టీటీడీ గదులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది



టీటీడీ ఆధ్వర్యంలో నిర్మించిన గదులు ఈ శ్రీరామనవమికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. సత్రం బాధ్యతలను అప్పచెప్పాలని ఇప్పటికే టీటీడీ అధికారులకు విన్నవించాం. జానకీ సదనం నిర్మాణ దశలోనే ఉంది. వీటితో పాటుగా భక్తుల కోసం వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నాం.
–రవీందర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, రామాలయం

వైభవంగా స్వామివారి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



గ్రామోత్సవంలో పాల్గొన్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు

ఖమ్మంగాంధీచౌక్: మహా శివరాత్రి సందర్భంగా ఖమ్మం నగరంలోని శ్రీ గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో శ్రీభ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత లింగోద్భవ అభిషేకం నిర్వహించగా భక్తులు ఉపవాసం, జాగరణ చేశారు.

గ్రామోత్సవాన్ని ప్రారంభించిన మంత్రి పువ్వాడ

శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి గ్రామోత్సవం కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ వేడుకను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. తొలుత ఆలయానికి వచ్చిన మంత్రి పువ్వాడను దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలు, పూర్ణకుంభంతో ఆహ్వానించారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆశీర్వచనం పలికారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవ రథాన్ని మంత్రి పువ్వాడ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ పసుమర్తి రామ్మోహన్‌రావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గుండు లక్ష్మీనారాయణ, ఈఓ చండూరు రామకోటేశ్వరరావు, అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'తొలకరి'



తొలకరి నాటికలోని ఓ సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి నెలనెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా అభ్యుదయ సాంస్కృతిక కదంబం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీఎల్ నర్సింహారావు రచించిన 'తొలకరి' నాటికను డాక్టర్ నిభానుడి దర్శకత్వంలో మధిర సుమిత్ర యూత్ అసోసియేషన్ కళాకారులు ప్రదర్శించారు. రైతుల జీవితంలో పండుగలు, వ్యవసాయం, జీవన విధానం ప్రముఖ పాత్ర వహిస్తాయని, తొలకరి జల్లుతో ప్రారంభమయ్యే వ్యవసాయం పంట ఇంటికి వచ్చే వరకు ఒక తపస్సులా ఉంటుందనే అంశంపై ప్రదర్శించిన ఈ నాటిక అందరినీ అలరించింది. అంతకుముందు తెలంగాణ తొలితరం ఉద్యమకారుడు అన్నాబత్తుల రవీంద్రనాథ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కొత్తమాసు హేమసుందర్‌రావు, కాంగ్రెస్ పార్టీ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మద్ది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఖమ్మం గుమ్మంలో సందేశాత్మక నాటికలను ప్రదర్శించటం అభినందనీయమన్నారు. స్పాన్సర్స్ అతిథులుగా హాజరైన డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు, డాక్టర్ బొప్పన దుర్గాసురేష్ కళాకారులకు పారితోషికం అందించారు. కార్యక్రమంలో ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేత, ఆర్ట్స్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు మోటమర్రి జగన్మోహన్‌రావు, ఏఎస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ఇజ్రాయిల్, స్వప్న ఆలపించిన గీతాలు ప్రేక్షకులను అలరించాయి. కమేడియన్ మొగిలి వెంకటేశ్వర్లు, రమేష్ తమ కళానైపుణ్యంతో సభికులను ఆకట్టుకున్నారు.

నాగయ్య రచనలు స్ఫూర్తిదాయకం

ఖమ్మంగాంధీచౌక్: దివంగత సాహితీవేత్త పాలడుగు నాగయ్య రచనలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజినీదేవి అన్నారు. ఆదివారం రాత్రి ఖమ్మంలో జాషువా సాహిత్య వేదిక అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన పాలడుగు నాగయ్య సమగ్ర సాహిత్యం సంపుటి పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజినీదేవి మాట్లాడుతూ.. నాగయ్య రచనలు కలకాలం నిలిచి ఉంటాయన్నారు. ఉపాధ్యాయుడిగా విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూనే బుర్రకథలు, జానపదం, ఏకపాత్రాభినయం, పద్యాలు వంటివి సామాన్య ప్రజానీకానికి అందుబాటులో ఉండే రచనలు చేశారని కొనియాడారు. రేడియో ఆర్టిస్టుగా కూడా ఆయన పనిచేశారని చెప్పారు. వేదిక ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బయటకొచ్చి పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరిప్రియ

- అజ్ఞాతం వీడాలని అసమ్మతి కౌన్సిలర్లకు హితవు
- మీడియా సమావేశంలో ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: ఈ నెల 6న అవిశ్వాస తీర్మాన పత్రం అందజేసిన అసమ్మతి కౌన్సిలర్లు అజ్ఞాతం వీడి, ప్రజాక్షేత్రంలో మీ సమస్యలపై పోరాడాలని ఎమ్మెల్యే బి.హరిప్రియ సూచించారు. ఆదివారం ఇల్లెందులోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి సోషల్ మీడియా కేంద్రంగా పోస్టులు పెడుతూ కొందరు విచ్ఛిన్నకర వ్యక్తుల వలలో చిక్కుకుని భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని చెప్పారు. కౌన్సిలర్ సరిత భర్త, మద్యం సిండికేట్ నడిపించే కొండపల్లి గణేష్ తన సతీమణిని చైర్‌పర్సన్‌ను చేయాలనే దురుద్దేశంతో ప్రలోభాలకు గురి చేసి తప్పుదారి పట్టిస్తున్నాడని ఆరోపించారు. అతనిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. బయటకొచ్చి ఐదుగురు నేతలతో ఏర్పాటు చేసిన ఫైమెన్ కమిటీతో చర్చించాలని సూచించారు. పార్టీ అధిష్టానం దృష్టిలో ఇల్లెందు మున్సిపల్ పోరు సమస్య ఉందని, పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘిస్తే ఉపేక్షించబోమని పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గంలో పర్యటిస్తూ బీఆర్ఎస్ విచ్ఛిన్నకర చర్యలకు పాల్పడుతున్నారని, వారి ట్రాప్‌లో పడొద్దని సూచించారు. వారికి ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదన్నారు.

క్రమశిక్షణ తప్పని సైనికుడిని..

బీఆర్ఎస్‌లో తాను క్రమశిక్షణ తప్పని సైనికుడినని, పురపాలక సంఘం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఏడాది కాలంగా సాగుతున్న కుట్ర వెనుక బలమైన శక్తులు ఉన్నాయని ఎమ్మెల్యే హరిప్రియ, కౌన్సిలర్ల సహకారంతో అభివృద్ధికి పాటుపడుతున్నానని, మంత్రి కేటీఆర్ రాకను అడ్డుకునేందుకు మరోమారు అవిశ్వాసం పేరుతో ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. తాను ఎమ్మెల్సీ తాతా మధుకు కమీషన్లు ముట్టజెబుతున్నట్లు ప్రచారం చేశారని, కలెక్టర్‌ను కూడా ఇబ్బందుల పాలు చేసేలా పోస్టులు పెట్టారని తెలిపారు. గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, రైతుబంధు రాష్ట్ర సభ్యులు పులిగళ్ల మాధవరావు, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్ మాట్లాడారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష పదవి ఉన్నట్టా..? లేనట్టా..?

క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో పట్టణ అధ్యక్షుడిపై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. గత జనవరి 4న బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడిగా మనోహర్ తివారీకి బీఆర్ఎస్ నేతలు స్వీట్లు తినిపించారు. కాగా అసమ్మతి కౌన్సిలర్ల ఇళ్ల ముందు వారం క్రితం బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆందోళన చేపట్టింది. అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల హోదాలో మనోహర్ తివారీ, పరుచూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ఆ ఆందోళన పార్టీ నిర్ణయమా? అని పాత్రికేయులు ప్రశ్నించగా.. పట్టణ అధ్యక్షకార్యదర్శులుగా తాను సంతకం పెట్టి ప్రెస్‌నోట్ రిలీజ్ చేశానా..? అంటూ హరిప్రియ ఎదురు ప్రశ్నించారు. దీంతో పట్టణానికి అధ్యక్షకార్యదర్శులు ఉన్నట్టా? లేనట్టా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

నూనె పంటలతో లాభాలెన్నో..



గుండాల మండలంలో సాగవుతున్న పొద్దుతిరుగుడు పంట

- ఆయిల్‌పామ్, పొద్దుతిరుగుడు, వేరుశనగకు ప్రోత్సాహం
- జిల్లాలో 40,304 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు
- 2,127 ఎకరాల్లో ఇతర పంటలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని, ఆర్థికంగా బలోపేతం కావాలని వ్యవసాయ, ఉద్యాన శాఖలు చేపట్టిన ప్రచారం ఫలితాలిస్తోంది. ప్రధానంగా వివిధ రకాల నూనెలు దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ప్రభుత్వం సూచిస్తుండగా రైతులు కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. జిల్లాలో 9,699 మంది రైతులు 40,304 ఎకరాల్లో పామాయిల్ సాగు చేస్తున్నారు. మరో 870 మంది రైతులు వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు పంటలను 2,127 ఎకరాల్లో వేశారు. వీటిలో అశ్వారావుపేట డివిజన్‌లో అధికంగా సాగు చేస్తుండడం విశేషం. ఈ డివిజన్‌లో 1,633.10 ఎకరాల్లో, భద్రాచలంలో 44.13, కొత్తగూడెంలో 51.25, మణుగూరులో 170.2, ఇల్లెందు డివిజన్‌లో 227.13 ఎకరాలలో మొత్తం 2,127.01 ఎకరాలలో ఇతర నూనె పంటలు సాగవుతున్నాయి. ఇక ఈ ఐదు డివిజన్లలో కలిపి 40,304.02 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారు.

అందుతున్న మద్దతు ధర..

నూనె పంటలకు మద్దతు ధర కూడా ఆశించిన స్థాయిలో అందుతుండడంతో రైతులు ఈ పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారిక లెక్కల ప్రకారం వేరుశెనగ సాగుకు ఎకరానికి సుమారు రూ.25 వేల వ్యయం అవుతుండగా 12 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. నువ్వుల సాగుకు ఎకరానికి రూ.15 వేలు ఖర్చు అవుతుండగా 4 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. పొద్దుతిరుగుడు పంటకు ఎకరానికి రూ.25 వేలు వ్యయం అవుతుండగా 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఆయిల్‌పామ్‌తో సహా ఇతర నూనె పంటలకు ధర కూడా బాగానే ఉంటుండడంతో రైతుల ఆర్థికాభివృద్ధికి సైతం దోహదపడుతున్నాయని అధికారులు చెబుతున్నారు.

మండలాల వారీగా ఆయిల్‌పామ్ సాగు ఇలా..

మండలం	రైతుల సంఖ్య	విస్తీర్ణం(ఎకరాల్లో)
అన్నపురెడ్డిపల్లి	284	1,210.03
అశ్వారావుపేట	2,612	11,221.39
చండ్రుగొండ	146	562.24
దమ్మపేట	5,875	23,570.06
ములకలపల్లి	328	1,650.10
చర్ల	10	13.33
దుమ్ముగూడెం	17	72.11
చుంచుపల్లి	1	15
జూలూరుపాడు	125	454.01
కొత్తగూడెం	6	17.15
లక్ష్మీదేవిపల్లి	8	49.03
పాల్వంచ	139	652.07
సుజాతనగర్	18	89.16
అళ్లపల్లి	8	30.34
అశ్వాపురం	13	61.09
బూర్గంపాడు	16	113.36
గుండాల	9	43.25
కరకగూడెం	9	29.1
పినపాక	15	66.28
టేకులపల్లి	53	335.29
ఇల్లెందు	7	44.23

నూనె పంటలకు డిమాండ్



మార్కెట్‌లో నూనె పంటలకు డిమాండ్ ఉంటుంది. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించి ఆర్థికంగా బలోపేతం కావాలి. ఆ దిశగా అవగాహనా కార్యక్రమాలు సైతం నిర్వహిస్తున్నాం.
– కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

ఆయిల్‌పామ్ పెరుగుతోంది



జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు పెరుగుతోంది. ప్రభుత్వ సూచనల మేరకు నూనె పంటల అవసరాన్ని రైతులకు వివరిస్తున్నాం. రైతులు కూడా ఈ పంటలతోనే లాభాలు అధికమని గ్రహించి, ఇటువైపే మొగ్గు చూపుతున్నారు.
– జీనుగు మరియన్న, జిల్లా ఉద్యాన అధికారి

క్లుప్తంగా

యువకుడిపై కేసు

పాల్వంచరూరల్: ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా నడిపి ఒకరి మృతికి కారణమైన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. కొత్తగూడెం లక్ష్మీదేవిపల్లికి చెందిన తాటి రాంపండు, అతడి స్నేహితుడు పూనెం వంశీ కలిసి ద్విచక్రవాహనంపై పాల్వంచ మండలం ఉల్వనూరులో జాతరకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి రాళ్లవాగు సమీపంలో కాల్వలో పడిపోయింది. ఈ ప్రమాదంలో శనివారం రాంపండు మృతిచెందిన విషయం విదితమే. మృతుడి తండ్రి నగేశ్ ఫిర్యాదు మేరకు ద్విచక్రవాహనాన్ని అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన వంశీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ

తాత, మనవడికి తీవ్రగాయాలు..

పరిస్థితి విషమం

పాల్వంచ: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో తాత, మనవడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడెం చిట్టిరామవరానికి చెందిన బానోతు వెంకటయ్య, అతడి మనవడు బానోతు మౌనేశ్ కలిసి పాల్వంచ గురుకులంలో చదువుతున్న మరో మనవడిని ఆదివారం కలిసేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో జగ్గుతండా క్రాస్ రోడ్డు సమీపంలో బీసీఎం రహదారిపై కొత్తగూడెం వైపు నుంచి వస్తున్న లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టడంతో మౌనేశ్ కాలు నుజ్జునుజ్జయింది. వెంకటయ్యకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన వారిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. మౌనేశ్ తండ్రి రాంబాబు సింగరేణి సంస్థల్లో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి ప్రమాదానికి గల కారణాలను సేకరించారు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రచయిత్రి ఇందిర మృతికి సంతాపం


ఇందిర (ఫైల్)

ఇల్లెందు: గజల్ రచయిత్రిగా గుర్తింపు పొందిన బైరి ఇందిర (60) ఆదివారం మృతిచెందారు. ఇల్లెందు పట్టణానికి చెందిన ఇందిర చిన్నతనం నుంచి రచయిత్రిగా రాణించింది. ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం చేస్తూనే సాహిత్యం పట్ల మక్కువతో కవితలు, రచనలు చేస్తూ ప్రశంసలందుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి తొలి గజల్ రచయిత్రిగా పేరు సంపాదించారు. కేన్సర్‌తో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఆమె మృతికి ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సాహితీ ప్రియులు సంతాపం ప్రకటించారు.

జూదరుల అరెస్ట్

ములకలపల్లి: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి జూదం ఆడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని చాపరాలపల్లి శివారులో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దాడులు చేపట్టి 11 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

మణుగూరుటౌన్: మణుగూరు మండలంలోని మల్లేపల్లి గోదావరి తీరంలో ఓ వ్యక్తి అనుమానస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గోదావరి తీరంలో ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించి. వెంటనే వారు అక్కడికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన వ్యక్తి మణుగూరు మండలంలోని అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన వెంకన్నగా గుర్తించారు. మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

ముహూర్తమెప్పుడో ?

బుగ్గపాడు ఫుడ్‌పార్కుకు పదిహేనేళ్లు..

- 60 ఎకరాల్లో అభివృద్ధి, 55 ఎకరాలు ఎంఎస్ఎంఈలకు కేటాయింపు
- ఇంకా మొదలు కాని పరిశ్రమలు
- ప్రారంభమైతే 30 వేల మందికి ఉపాధి
- లీజ్ అగ్రిమెంట్ నిబంధనలతో పారిశ్రామికవేత్తల వెనకడుగు?



బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్కు ముఖద్వారం

సత్తుపల్లి: ఉమ్మడి జిల్లాలోని సత్తుపల్లి, అశ్వారావుపేట ప్రాంతాల్లో పండ్ల తోటలు విస్తారంగా సాగవుతున్న నేపథ్యాన సత్తుపల్లి మండలం బుగ్గపాడులో టీఎస్ఐఐసీ ఆధ్వర్యాన మెగా ఫుడ్‌పార్కు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పండ్లతో ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా వేలాది మందికి ఉపాధి లభిస్తుందని.. రైతులకు కూడా మెరుగైన ధర లభిస్తుందనే ఉద్దేశంతో ఈ నిర్ణయానికి వచ్చింది. కొబ్బరి, మామిడి, సపోట, నిమ్మ, జామ, మొక్కజొన్న పంటల ఉత్పత్తులతో రైతులకు మేలు కలిగేలా పరిశ్రమలు స్థాపిస్తామంటూ వారి నుంచి 203 ఎకరాల భూమి సేకరించింది. ఈ పార్క్ ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి దక్కుతుందని చెప్పగా.. స్థలం, భవనాలు అందుబాటులోకి వచ్చి పదిహేనేళ్లయినా ఇంకా మాటలకే పరిమితం అవుతోంది. దీంతో అటు రైతులు, ఇటు యువత ఆవేదన చెందుతున్నారు.

వైఎస్సార్ హయాంలోనే తొలి అడుగు..

2008 జనవరి 27న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా బుగ్గపాడు ఫుడ్ పార్క్ ఏర్పాటుకు తొలి అడుగు పడింది. 203 ఎకరాల భూసేకరణ చేపట్టి భూమిపూజ చేశారు. ఇక 2016 నవంబర్ 13న పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్, అప్పటి ఆర్అండ్‌బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా రూ.109.44 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులన్నీ పూర్తయి రెండేళ్లు కావస్తుండగా ప్రారంభోత్సవానికి ముహూర్తం కుదరడం లేదు. ఫలితంగా భవనాలన్నీ బూజుపట్టి, జనరేటర్లు ఎండకు ఎండి.. వానకు తడిసి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. యాంకరింగ్ ప్రాజెక్టు కింద బెంగళూరుకు చెందిన ఫ్రూషన్ ఇండియా, బయోగ్రీన్ ఇండియా కంపెనీలకు భూములు కేటాయించారు. అయితే ఫ్రూషన్ ఇండియా కంపెనీకి బ్యాంక్ రుణాల సమస్య తలెత్తటం వల్ల పనులు చేపట్టలేదని సమాచారం. దీంతో పిల్లర్ల దశలోనే పనులు నిలిచిపోయాయి. అలాగే, బయోగ్రీన్ ఇండియా కంపెనీ అసలు పనులే ప్రారంభించలేదు.

లీజ్ ధర కారణంగానే వెనకడుగు ?

బుగ్గపాడు ఫుడ్‌పార్కులో పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకునే వారికి భూమిని 33 ఏళ్ల పాటు లీజ్‌కు ఇస్తారు. ఎకరాకు రూ.45 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అవసరమైతే భూమి లీజ్ గడువు పొడిగిస్తామే తప్ప విక్రయించేది లేదని ప్రభుత్వం ప్రకటించింది. అయితే రూ.45 లక్షలు లీజ్ ఫీజుగా చెల్లించాల్సి రావడంతో పారిశ్రామిక వేత్తలు పెద్దగా ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఎకరం భూమి ధర రూ.30 నుంచి రూ.35 లక్షలు ఉండగా ఒకసారి కొనుగోలు చేస్తే పారిశ్రామిక వేత్తల సొంతం కావడమే కాక ఏటా ధర పెరుగుతుంది. అదే లీజ్‌కు తీసుకుంటే ఆ పరిస్థితి ఉండకపోవడంతోనే ఎవరూ ఆసక్తి చూపించడం లేదని సమాచారం. లీజ్ ధర తగ్గిస్తే పారిశ్రామిక వేత్తలు ముందుకొచ్చే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అయితే టీఎస్ఐఐసీ వాదన మాత్రం మరోలా ఉంది. ఫుడ్ పార్కులో కేటాయించిన భూముల్లో పరిశ్రమల స్థాపనకు ముందుకొస్తే అనుమతులు త్వరగా వస్తాయని, ఫుడ్‌పార్కుకు అవసరమయ్యే గోదాంలు, మిషనరీలు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండటం అనుకూలిస్తుందని అంటున్నారు.

నిర్మాణం పూర్తయిన కోల్డ్ స్టోరేజి



భవన నిర్మాణాలు పూర్తి..

రూ.109 కోట్లతో 60 ఎకరాల్లో ఫుడ్‌పార్కుకు అనుసంధానంగా పరిపాలన భవనం, కోల్డ్ స్టోరేజ్‌లు, వేర్‌హౌస్‌లు, ప్యాకింగ్ గోడౌన్, ట్రీట్‌మెంట్ ప్లాంట్, వేబ్రిడ్జి, విద్యుత్ సబ్ స్టేషన్, ప్రహరీ, సెంట్రల్ లైటింగ్, డివైడర్ రోడ్లు, డ్రెయినేజీలు, వాటర్ ప్లాంట్ల నిర్మాణం పూర్తయింది. కాగా రూ.50 కోట్లతో మరో 55 ఎకరాల్లో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు పనులు చేపట్టారు. పరిపాలన భవనం, రోడ్ల పనులు జరుగుతున్నాయి.

పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారు..

కోల్డ్‌స్టోరేజీ, వేర్ హౌస్ నిర్వహణ లీజ్‌కు ఇప్పటికే దరఖాస్తులు వచ్చాయి. టీఎస్ఐఐసీ వెబ్‌సైట్‌లో బుగ్గపాడు మెగాఫుడ్ పార్కు వివరాలు పొందుపర్చాం. పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించేందుకు ఉన్నతాధికారులు తగిన కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే ఫుడ్‌పార్క్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. చిన్నతరహా పరిశ్రమలకు సంబంధించి భూమి అభివృద్ధి పనులు చేపడుతున్నాం.

– పవన్‌కుమార్, టీఎస్ఐఐసీ, జోనల్ మేనేజర్, ఖమ్మం

అర్ధరాత్రి భవనం కూల్చివేతకు యత్నం

అడ్డుకున్న స్థానికులు, పోలీసులకు ఫిర్యాదు


కూల్చిన భవనాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

అశ్వాపురం: మండలంలోని మొండికుంట గ్రామంలో అర్ధరాత్రి వీధి లైట్లు ఆఫ్ చేసి జేసీబీ సాయంతో గుర్తు తెలియని వ్యక్తులు పాత గ్రామ పంచాయతీ కార్యాలయ భవన సముదాయాన్ని కూల్చివేసేందుకు యత్నించారు. పెద్దపెద్ద శబ్దాలు రావడంతో స్థానికులు వచ్చి భవనం కూల్చివేతను అడ్డుకున్నారు. స్థానికులు వచ్చే సరికి కూల్చివేతకు యత్నించిన వ్యక్తి పరారయ్యాడు. గ్రామస్తులు పోలీసులకు, ఎంపీడీఓకు సమాచారం అందించారు. ఊరు మధ్యలో పాత పంచాయతీ కార్యాలయ భవనాన్ని అర్ధరాత్రి కూల్చివేసేందుకు యత్నించడంపై విమర్శలు, అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల అనుమతి లేకుండా, పంచాయతీ పాలకవర్గ తీర్మానం లేకుండా, సంబంధిత అధికారులు, సర్పంచ్, పాలకవర్గం, గ్రామ పెద్దలు లేకుండా అర్ధరాత్రి భవనం కూల్చివేతకు పాల్పడింది ఎవరు? అనేది చర్చనీయాంశమైంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష పార్టీల నాయకులు అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు పాత పంచాయతీ కార్యాలయ భవనం కూల్చివేతకు పాల్పడ్డారని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి సైదులు అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, గ్రామంలో గుడి నిర్మించడం కోసమే పంచాయతీ భవనం కూలుస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పంచాయతీ కార్యదర్శి సైదులును వివరణ కోరగా.. పాత గ్రామ పంచాయతీ భవనం కూల్చివేతకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతులు రాలేదని తెలిపారు. ఎస్‌ఐ జితేందర్‌ను వివరణ కోరగా.. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు ప్రజా ఆస్తుల ధ్వంసంపై మల్టీ పర్పస్ వర్కర్ శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న ట్రాక్టర్


రోడ్డు పక్కకు దూసుకుపోయిన ట్రాక్టర్


చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

చండ్రుగొండ: మండలంలోని దామరచర్ల వద్ద జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. అందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కొత్తగూడెంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలిలా ఉన్నాయి.. బూర్గంపాడు మండలం లక్ష్మీపురం నుంచి పెనుబల్లి మండలం లింగగూడెం వెళ్తున్న ట్రాక్టర్‌ను భద్రాచలం నుంచి మచిలీపట్నం వెళ్తున్న ఆర్టీసీ లగ్జరీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ చక్రాలు ఊడిపోయి విద్యుత్ స్తంభానికి గుద్దుకుని పక్కకు దూసుకుపోయింది. ఈ ప్రమాదంతో ట్రాక్టర్ డ్రైవర్ రమేశ్‌తోపాటు ట్రాక్టర్‌పై ప్రయాణిస్తున్న శ్యాం, శ్రీనులకు గాయాలయ్యాయి. అదే సమయంలో దామరచర్లకు చెందిన గోపాల్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఊడిపోయిన ట్రాక్టర్ టైరు సైకిల్‌కు తగలడంతో గోపాల్ తీవ్రగాయాలపాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ విజయలక్ష్మి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. తీవ్రంగా గాయపడిన సైక్లిస్ట్ గోపాల్‌ను కొత్తగూడెం తరలించారు. అయితే ట్రాక్టర్ డ్రైవర్ రమేశ్ మద్యం మత్తులో ఉండటంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. అతడిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేతబడి నెపంతో దారుణ హత్య

- ఖమ్మం జిల్లా చెన్నూరులో ఘటన
- హతుడు, నిందితుడూ ఒక కుటుంబీకులే..


శ్రీనివాసరావు (ఫైల్)


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కల్లూరురూరల్: చేతబడి నెపంతో బాబాయి వరుసయ్యే ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన కల్లూరు మండలం చెన్నూరులో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పాటిబండ్ల శ్రీనివాసరావు(46) స్థానికంగా ఎల్లమ్మ, ఉప్పలమ్మ దేవతలకు పూజారిగా పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం సంజీవరావు అనే మరో వ్యక్తితో కలిసి పొలానికి మందు వేసేందుకు వెళ్లాడు. కాగా, అతడికి కుమారుడి వరసయ్యే శివ.. అకస్మాత్తుగా కత్తి, వేట కొడవలితో వచ్చి శ్రీనివాసరావుపై దాడికి దిగాడు. పక్కనున్న సంజీవరావు కాపాడేందుకు ప్రయత్నించగా తప్పుకోకుంటే నీపైనా దాడి చేస్తానని బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన సంజీవరావు పక్కకు వెళ్లి గ్రామస్తులకు ఫోన్ చేస్తుండగానే.. శివ శ్రీనివాసరావుపై వేట కొడవలితో మెడ, కాళ్లు, వీపుపై విచక్షణారహితంగా నరికాడు. దీంతో శ్రీనివాసరావు అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే శివ అక్కడి నుంచి పరారయ్యాడు.

అనుమానమే అంతం చేసింది..

శ్రీనివాసరావు చెన్నూరు, రావికంపాడు గ్రామాల్లో ఎల్లమ్మ, ఉప్పలమ్మ దేవతలకు పూజారిగా వ్యవహరిస్తుంటాడు. అయితే తమ కుటుంబంలో కొంత కాలంగా సమస్యలు వస్తున్నాయని, దీనికి చేతబడి చేయడమే కారణమని, అదికూడా శ్రీనివాసరావే చేశాడని శివ బలంగా నమ్మాడు. దీంతో శ్రీనివాసరావును హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. అతడు ఆదివారం పొలానికి వెళ్లినట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి ఈ దారుణానికి ఒడిగట్టాడు. శివ, శ్రీనివాసరావు ఒకే కుటుంబానికి చెందినవారు కావడం గమనార్హం. అయితే చేతబడి అనుమానం తప్పితే గతంలో వారిద్దరి మధ్య ఎలాంటి గొడవలు లేవని స్థానికులు చెబుతున్నారు. శ్రీనివాసరావుకు భార్య కృష్ణమ్మ, కుమార్తె రమ్య ఉన్నారు. ఈ ఘటనపై ఏసీపీ రామానుజంను వివరణ కోరగా.. ఇప్పటివరకు మృతుడి కుటుంబసభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని చెప్పారు. నిందితుడు శివ పరారీలో ఉన్నాడని, రెండు బృందాలు అతడికోసం గాలిస్తున్నాయని తెలిపారు. ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామన్నారు.

ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సేవలు భేష్

డీఎంహెచ్‌ఓ శిరీష



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శిరీష

పాల్వంచ: కంటి వైద్యసేవల్లో ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి సేవలు ప్రశంసనీయమని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శిరీష అన్నారు. ఆదివారం స్థానిక ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్య శాఖ 13వ వార్షికోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిరీష మాట్లాడుతూ అధునాతన పరికరాలతో మారుమూల, పేద ప్రజలకు సైతం ఉత్తమమైన వైద్య సేవలు అందిస్తున్నారని, గత 12 సంవత్సరాల్లో ఎలాంటి చిన్న ఫిర్యాదు కూడా లేకుండా ప్రజల మన్ననలు పొందడం విశేషమని పేర్కొన్నారు. కంటి వెలుగు నుంచి పంపిన సుమారు వెయ్యి మంది రోగులకు శస్త్ర చికిత్స చేశారని, పెద్ద ఆపరేషన్‌లను సైతం విజయవాడ, హైదరాబాద్‌లకు పంపే పనిలేకుండా ఇక్కడ చికిత్స చేస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం నవభారత్ వైస్ ప్రెసిడెంట్ వైవీ శ్రీనివాస్, పాల్వంచ సెంటర్ చాంపియన్, రెటీనా కన్సల్ట్ డాక్టర్ ఆదిత్యకపూర్ మాట్లాడారు. కార్యక్రమంలో నవభారత్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస రెడ్డి, వైద్యులు వర్షారఫీ, హర్ష, ప్రసాద్, నరేశ్‌రావు, ఏఓ యు.విజయ్‌కుమార్, వంశీధర్, శ్రీదేవి, అన్వేశ్‌రావు, సాయితేజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకుల బాలికల హాస్టల్‌లో విచారణ

మధిర: మధిరలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల బాలికల వసతిగృహంలో ప్రిన్సిపాల్ విద్యార్థినులను తీవ్రంగా కొట్టిన ఘటనపై జాయింట్ కలెక్టర్ మధుసూదన్‌రావు ఆదేశాల మేరకు విచారణాధికారి జ్యోతి ఆదివారం విచారణ జరిపారు. బాలికల వసతిగృహాన్ని ఒక విద్యార్థి సంఘం నేత సందర్శించిన సందర్భంగా భోజనం సక్రమంగా ఉండటం లేదని, కూరలు మంచిగా చేయటం లేదని విద్యార్థినులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న వసతిగృహం ప్రిన్సిపాల్ ఇరవై మంది విద్యార్థినులను తీవ్రంగా కొట్టారు. ఈ ఘటనకు సంబంధించి విద్యార్థినులను విచారించి ఘటనకు గల కారణాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వసతిగృహంలో ప్రిన్సిపాల్ విద్యార్థినులను కొట్టిన విషయంపై జరిపిన విచారణ నివేదికను జాయింట్ కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.


విద్యార్థినులను విచారిస్తున్న అధికారి జ్యోతి

పార్కులో తుప్పుపట్టిన జారుడుబల్ల

ఆడుకుంటూ గాయపడిన చిన్నారి


గాయపడిన బాలుడు కార్తీక్


పార్కులో తుప్పపట్టిన జారుడుబల్లా

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట చిల్డ్రన్ పార్క్‌లోని ఆటవస్తువులు తుప్పుపట్టి చిన్నారుల పాలిట ప్రమాదకరంగా మారుతున్నాయి. అయినప్పటికీ ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్కు అధ్వానంగా ఉందనేందుకు ఆదివారం జరిగిన ఘటనే ఉదాహరణగా నిలుస్తోంది. మండలంలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయం ఎదుట భక్తులు, చిన్నారులు ఆడుకునేందుకు 2008లో శివ అనే భక్తుడు విరాళంగా ఇచ్చిన డబ్బుతో పార్కు ఏర్పాటు చేశారు. అందులో జారుడుబల్లా, ఊయల ఏర్పాటు చేశారు. అయితే, ఆట వస్తువుల్లో కొన్ని తుప్పుపట్టిపోయాయి. టెకులపల్లి మండలం శంభునిగూడెం గ్రామానికి చెందిన బాలుడు కార్తీక్ జారుడుబల్లా ఎక్కి జారుతుంటే తుప్పుపట్టి ఉండటంతో వేలుకు తీవ్ర గాయమైంది. దీంతో బాలుడి బంధువులు పార్కు నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తుప్పుపట్టిన ఆటవస్తువులను తొలిగించి వాటి స్థానంలో కొత్త వస్తువులను ఏర్పాటు చేయాలని బాలుడి తండ్రి రామకృష్ణ ఈఓను కోరారు.

11వ వేతన ఒప్పందం పూర్తిచేయాలి


మాట్లాడుతున్న మందా నర్సింహారావు

టేకులపల్లి: 11వ వేతన ఒప్పందం వెంటనే పూర్తి చేయాలని జేబీసీసీ సభ్యుడు, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు డిమాండ్ చేశారు. ఆదివారం కోయగూడెం ఓపెన్ కాస్ట్‌లో ఏర్పాటు చేసిన పిట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కోలిండియా యాజమాన్యం 11వ వేతన ఒప్పందాన్ని పూర్తి చేయడానికి కాలయాపన చేస్తున్నదని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. దాదాపు నెలన్నరగా సమావేశం ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమని చెప్పారు. కార్యక్రమంలో ఇల్లెందు బ్రాంచ్ నేత ఎండీ అబ్బాస్, బాణోతు చందర్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు 'కొర్లగూడెం'కు మోక్షం

- ఎత్తిపోతల పథకం పనుల్లో కదలిక
- పనుల పూర్తికి నిధులు విడుదల
- పూర్తయితే 800 ఎకరాలకు సాగునీరు


కొర్లగూడెం పడమర వాగుపై ఎత్తిపోతల పథకం నిర్మించే ప్రాంతం

కల్లూరురూరల్: మండలంలోని కొర్లగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని పడమటివాగుపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఇక్కడ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.4.41 కోట్లు కేటాయించగా.. 2018 ఫిబ్రవరి 11న అప్పటి భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఈ పథకానికి శంకుస్థాపన చేశారు. దీంతో 810 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు సరఫరా ఇవ్వాలనేది లక్ష్యం. అయితే, 90 శాతం మేర పనులు పూర్తయినా మిగులు పనులు, విద్యుత్ సౌకర్యం కల్పించే పనులకు నిధుల విడుదలలో జాప్యం, కోవిడ్ తదితర కారణాలతో ఐదు నెలల్లో అందుబాటులోకి రావాల్సిన పథకం ఐదేళ్లయినా పూర్తి కాలేదు. ఇటీవల నిధులు విడుదల చేయడంతో అధికారులు మిగిలిన పనులు పూర్తి చేయించడంపై దృష్టి సారించారు.

5.76 క్యూసెక్కుల నీరు

సుమారు 810కి పైగా ఎకరాలకు సాగునీరు అందించేలా కొర్లగూడెం ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు. అందుకోసం 5.76 క్యూసెక్కుల నీటిని కేటాయించారు. వాగు నుంచి నీటిని తోడేందుకు 60 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన రెండు మోటార్లను ఏర్పాటుచేశారు. అలాగే, త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కోసం రూ.18 లక్షల బడ్జెట్ కేటాయించినా పనుల్లో జాప్యంతో బడ్జెట్ రెట్టింపు అయింది. ప్రస్తుతం ఈ పనులకు రూ.26 లక్షలు అవసరమని అధికారులు ప్రతిపాదనలు సమర్పించారు. నిధులు మంజూరైతే టేకులపల్లిలోని 133 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సౌకర్యం కల్పిస్తారు.

మేనెల నాటికి సాగునీరు

కొర్లగూడెం ఎత్తిపోతల పథకం మిగులు పనుల పూర్తికి నిధులు విడుదలైనందున వేగం పెరిగేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్, కల్లూరు డివిజన్ ఈఈ లక్ష్మీనారాయణ, డీఈఈ రత్నాకర్ ఎత్తిపోతల పథకం పనులను ఇటీవల పరిశీలించి కాంట్రాక్టర్‌కు సూచనలు చేశారు. ఎట్టి పరిస్థితుల్లో మే నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసి ఆయకట్టు పొలాలకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు అధికారులు చె బుతున్నారు. అయితే, ప్రస్తుతం రబీ వరి పంట సాగవుతుండటంతో విద్యుత్ సౌకర్యం కోసం స్తంభాలు వేయడం సాధ్యపడడం లేదు. పంట కోశాక త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కోసం పనులు చేపట్టి పూర్తి చేయనున్నారు.

మెరక భూములకు ఢోకా లేనట్లే..



కొర్లగూడెం ఎత్తిపోతల పథకం పూర్తయితే మెరక భూములకు సాగునీరు పుష్కలంగా అందనుంది. ఈ పథకానికి గతంలోనే బడ్జెట్ కేటాయించినా సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో జాప్యం జరిగింది. ఇప్పుడు నిధులు వచ్చిన నేపథ్యాన మిగులు పనులు పూర్తి చేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పిస్తే ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వస్తుందని అనుకుంటున్నాం.

– బైరెడ్డి నర్సింహారెడ్డి, సర్పంచ్, కొర్లగూడెం

గోదావరిలో ఇద్దరు యువకుల గల్లంతు


అక్బర్‌పాషా(ఫైల్)


వాసు (ఫైల్)

భద్రాచలంఅర్బన్: గోదావరిలో ఈత కొట్టేందుకు వెళ్లి ఇద్దరు యువకులు గల్లంతైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని అశోక్‌నగర్, ఏఎంసీ, జగదీశ్‌కాలనీకి చెందిన ఆరుగురు యువకులు.. ఎటపాక ప్రాంతంలోని మేడువాయి వద్ద ఉన్న గోదావరిలో ఈత కొట్టేందుకు ఆదివారం సాయంత్రం వెళ్లారు. వారిలో అక్బర్ పాషా (17), వాసు (16) గల్లంతయ్యారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన సమాచారం కొంత ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, భద్రాచలం సీఐ నాగరాజురెడ్డి, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చెరుకుని, వివరాలు ఆరా తీశారు. జరిగిన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కావడంతో అక్కడి అధికారులకు సమాచారం చేరవేశారు. ఘటన జరిగిన ప్రదేశంలో గోదావరి నీళ్లు ఎక్కువగా ఉండటంతో పాటు లోతును అంచనా వేయలేకపోవడం, ఆ ప్రదేశంలో ఎక్కువ శాతం రాళ్లు ఉండటంతో రాత్రి సమయంలో ఎలాంటి రెస్క్యూ చేయలేని పరిస్థితి ఏర్పడినట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా...

'ఏపీ ఇంధన పొదుపు'పై జర్మనీ అధ్యయనం

సాక్షి, అమరావతి: ఇంధన పొదుపు, సామర్థ్య కార్యక్రమాల్లో జాతీయ స్థాయిలో అవార్డులు సాధించిన ఆంధ్రప్రదేశ్.. తాజాగా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. సోలార్, విండ్ తదితర పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులను ముమ్మరంగా చేపట్టడం, పరిశ్రమల్లో ఇంధన సామర్థ్య కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో ఏపీ సాధించిన విజయాలు జర్మనీని ఆకర్షించాయి. వీటిపై అధ్యయనం చేయడానికి కన్సల్టెన్సీ ప్రైస్ వాటర్ కూపర్స్ (పీడబ్ల్యూసీ)ను.. జర్మన్ కార్పొరేషన్ ఫర్ ఇంటర్నేషనల్ కో–ఆపరేషన్ నియమించింది. ఈ అధ్యయనంలో భాగంగా పీడబ్ల్యూసీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రభాత్ నేతృత్వంలోని బృందం రెండు రోజులుగా విజయవాడలో ఇంధన పరిరక్షణ మిషన్, నెడ్ క్యాప్ అధికారులతో చర్చిస్తోంది. పారిశ్రామిక రంగంలో ఏపీ సాధించిన విజయాలను అధ్యయనం చేస్తోంది. ఏపీ ఇంధన పరిరక్షణ మిషన్ 'టార్చ్ బేరర్' అంటూ ప్రభాత్ అభినందించారు.

23న టీడీపీలోకి కన్నా!

గుంటూరు మెడికల్: బీజేపీకి రాజీనామా చేసిన మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఈ నెల 23న టీడీపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. ఆదివారం గుంటూరులోని తన నివాసంలో కార్యకర్తలు, అనుచరులతో జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ బాధ్యతలు కన్నాకు అప్పగించే అవకాశాలున్నట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు.

పరమేశ్వరుడిని కించపరిచేలా ప్రచారమా?

వైఎస్సార్‌సీపీపై బీజేపీ నేతల విమర్శలు

సాక్షి, అమరావతి/ ఎంవీపీ కాలనీ (విశాఖ తూర్పు): అధికార వైఎస్సార్‌సీపీ అధికారిక ట్విటర్ ఖాతా ద్వారా పరమేశ్వరుడిని కించపరిచేలా ప్రచారం చేస్తోందని ఏపీ బీజేపీ తప్పుపట్టింది. ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు తదితర నేతలు ఆదివారం వైఎస్సార్‌సీపీ వైఖరిపై విమర్శలు గుప్పించారు. ఏపీ వ్యాప్తంగా శివాలయాల వద్ద ఆందోళన చేపట్టాలని పిలుపునివ్వగా, అక్కడక్కడ బీజేపీ నేతలు శివాలయాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విశాఖలో జీవీఎల్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హిందువుల మనోభావాలను దెబ్బ తీస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాల శివుని వేషధారణలో ఉన్న వీధి బాలుడికి పాలు పోస్తున్నట్లు ఫొటో రూపొందించడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలన్నారు.

మేనమామ మేలిమి 'కానుక'

ఏపీలో అత్యుత్తమంగా 'జగనన్న విద్యాకానుక'

- ఖరీదైన బ్యాగ్, మిలమిల మెరిసే బూట్లు
- ఆకర్షణీయంగా చెక్స్ యూనిఫామ్.. పెరిగిన క్లాత్ పరిమాణం
- రూ.1,042.53 కోట్లతో 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు కిట్లు



సాక్షి, అమరావతి: ఏపీలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడింపచేస్తూ అందచేస్తున్న జగనన్న విద్యా కానుక (జేవీకే) కిట్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మరింత నాణ్యతతో, సకాలంలో సమకూర్చేలా విద్యాశాఖ సన్నద్ధమైంది. రూ.1,042.53 కోట్ల వ్యయంతో 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించేలా ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈసారి విద్యార్థులకు మరింత మన్నికతో కూడిన నాణ్యమైన బ్యాగ్‌లు, బూట్లను అందించనున్నారు. యూనిఫామ్‌ను ప్లెయిన్ క్లాత్ కాకుండా ఆకర్షణీయంగా రంగు రంగుల చెక్స్ డిజైన్‌తో రూపొందించారు. దుస్తులు కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా యూనిఫామ్ క్లాత్‌ను అదనంగా పెంచారు. ఇక పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్ ముద్రణ పనులు ఇప్పటికే ప్రారంభం కాగా ఈనెల 24వ తేదీ నుంచి జిల్లా పాయింట్లకు పంపిణీ మొదలవుతుంది. స్కూళ్లు తెరిచే రోజే వీటిని విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల పట్ల పెరుగుతున్న ఆదరణ, ఏటా అదనంగా చేరుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఐదు శాతం అదనపు బఫర్‌తో ప్రభుత్వం 5.06 కోట్ల పాఠ్యపుస్తకాలను ముద్రిస్తుండటం గమనార్హం. విద్యాకానుక ద్వారా అందించే ప్రతి ఒక్క వస్తువు నాణ్యతను స్వయంగా పరిశీలిస్తూ ఓ మేనమామలా ముఖ్యమంత్రి జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న విషయం తెలిసిందే. మూడున్నరేళ్లుగా జేవీకే అమలు తీరును గమనిస్తూ ఫీడ్ బ్యాక్ ఆధారంగా మార్పు చేర్పులను సూచిస్తున్నారు.

- ➤ స్థానిక మార్కెట్లో సుమారు రూ.650 విలువ చేసే నాణ్యమైన బ్యాగులను సరఫరా చేసేందుకు మంజీత్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్, కోర్స్ ఇండియా లిమిటెడ్, అభిలాష కమర్షియల్ ప్రైవేట్ లిమిటెడ్, ఎక్స్‌వో ఫుట్‌వేర్ ప్రైవేట్ లిమిటెడ్, వినిష్మా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేసి ఆర్డర్లు ఇచ్చారు. స్పేర్ టైపులో పెద్ద బ్యాగులు రీ డిజైన్ చేశారు.
- ➤ యూనిఫామ్‌కి సంబంధించి బాలికల టాప్, బాలుర షర్ట్‌లను ప్లెయిన్ క్లాత్ నుంచి చెక్స్ (గడులు) రూపంలోకి మార్పు చేశారు. దుస్తులు కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా క్లాత్ పరిమాణాన్ని కూడా దాదాపు 20 శాతం పెంచారు. మఫత్‌లాల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, నందన్ డెనిమ్ లిమిటెడ్, కంచన్ ఇండియా లిమిటెడ్, అరవింద్ కాట్సిన్ ఇండియా లిమిటెడ్, పదమ్ చంద్ మిలాప్‌చంద్ జైన్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేశారు.
- ➤ బూట్లు మరింత కాంతివంతంగా (షైనింగ్) ఉండేలా చర్యలు చేపట్టారు. సరఫరాదారులు పాత మెటీరియల్ వాడకుండా నియంత్రించారు. డైమండ్ ఫుట్‌కేర్ ఉద్యోగ్ ప్రైవేట్ లిమిటెడ్, మంజీత్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్, ఎక్సటో ఫుట్ వేర్ ప్రైవేట్ లిమిటెడ్, పవర్ టెక్ ఎలక్ట్రో ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, లెహర్ ఫుట్‌వేర్ లిమిటెడ్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేసి పంపిణీ ఆర్డర్లు ఇచ్చారు.
- ➤ 1 నుంచి 9వ తరగతి వరకు బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు ప్రచురిస్తున్నారు. ఈ ఏడాది కొత్తగా 6, 7, 9 తరగతుల విద్యార్థుల కోసం ఎన్సీఈఆర్టీ సిలబస్‌తో బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు ముద్రిస్తున్నారు. తమిళనాడు న్యూ ప్రింట్ పేపర్స్ లిమిటెడ్ కాగితాన్ని సరఫరా చేస్తోంది. 40 లక్షల మందికిపైగా విద్యార్థులకు రెండు సెమిస్టర్ల విధానంలో పుస్తకాలు తయారు చేస్తున్నారు. దాదాపు 4.83 కోట్ల పుస్తకాలు ముద్రించి అందించనున్నారు.

రాజ్యాంగం పట్ల పాలకులకు చిన్నచూపు

ప్రముఖ జర్నలిస్టు, రచయిత సతీష్‌చందర్

- మనుస్మృతిని కాలరాయాలి: రచయిత్రి జూపాక సుభద్ర
- రాజ్యాంగ హక్కుల రక్షణ కోసమే జేఏసీ: ప్రజాకవి జయరాజ్



సతీష్‌చందర్‌తో పాటు పలువురిని అరెస్టు చేసిన దృశ్యం

ముషీరాబాద్: రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల పాలకులు చిన్నచూపు చూస్తున్నారని ప్రముఖ జర్నలిస్టు, రచయిత సతీష్‌చందర్ విమర్శించారు. ఆదివారం ఏజీ ఆఫీసు సమీపంలోని అంబేడ్కర్ రిసోర్స్ సెంటర్‌లో భారత రాజ్యాంగం వర్సెస్ మనుస్మృతి అనే అంశంపై విజ్ఞాన దర్శిని ఆధ్వర్యంలో సెమినార్ జరిగింది. సతీష్ చందర్ మాట్లాడుతూ పాలకులు మనువాద పద్ధతుల్లో వ్యవహరిస్తున్నారని నిందించారు. వ్యతిరేకించే వారికి కూడా వ్యతిరేకత తెలిపే స్వేచ్ఛను రాజ్యాంగం ఇచ్చింది కానీ దాన్ని పాటిస్తామని వాగ్దానం చేసిన పాలకులే హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆరోపించారు. రచయిత్రి జూపాక సుభద్ర మాట్లాడుతూ మనుస్మృతిని అగ్రకుల మహిళలే ఎక్కువగా వ్యతిరేకించాలని, దళిత, బీసీలు కూడా మనుస్మృతిని కాలరాయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ ప్రజాకవి జయరాజ్ మాట్లాడుతూ అంబేడ్కర్, మార్క్స్, బుద్ధుడు చెప్పిన అంశాలు ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల రక్షణ కోసమే జేఏసీ ఏర్పడిందని తెలిపారు.

అకారణ అరెస్టులపై ఆగ్రహం

కాగా, రెండు రోజుల క్రితం అంబేడ్కర్‌పై హమారా ప్రసాద్ అనే వ్యక్తి చేసిన వాఖ్యల పట్ల అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమానికి ఆందోళనకారులు పిలుపునిచ్చారు. ఈ సభికులు కూడా అక్కడకి వెళ్తారని భావించిన పోలీసులు సతీష్‌చందర్, జయరాజ్, సుభద్ర తదితరులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, వారికి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. తాము నిరసన కార్యక్రమానికి పిలుపు ఇవ్వలేదని, వారికీ తమకు సంబంధం లేదని చెప్పినప్పటికి పోలీసులు బలవంతంగా వ్యాన్‌లోకి ఎక్కించి నాంపల్లి, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. అరెస్టయిన వారిలో సతీష్‌చందర్, జయరాజ్, సుభద్రతో పాటు విజ్ఞాన దర్శిని కన్వీనర్ రమేష్, జనార్థన్, ఝాన్సీ, స్వరూప, దినకర్ శ్రీనివాస్, సైకల్యాబ్ బాబు, విజయ్‌కుమార్ తదితరులున్నారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై విడిచిపెట్టారు. ఈ సందర్భంగా సతీష్ చందర్ మాట్లాడుతూ పాలకులకు భారత రాజ్యాంగానికి రక్షకులు ఎవరో భక్షకులు ఎవరో తెలియక పోవడం విచారకరమని వ్యాఖ్యానించారు.

హిందువులంటే మీరేనా.. మేం కాదా?

- సీఎం ఎక్కడా, ఎప్పుడూ ఎవరినీ అగౌరవ పరచలేదు
- వైఎస్సార్‌సీపీ నేతల స్పష్టీకరణ

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: 'మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా, అన్నార్తుల ఆకలి తీర్చడమే ఈశ్వర ఆరాధన అని చెబుతూ.. మా పార్టీ అఫీషియల్ ట్విటర్ ఖాతాలో ట్వీట్ చేసింది. రాష్ట్ర ప్రజలందరికీ శివయ్య చల్లని దీవెనలు ఉండాలని కోరుకుంటూ శుభాకాంక్షలు చెప్పింది. ఇందులో హిందువుల మనోభావాలు ఎక్కడ దెబ్బ తిన్నాయో అర్థం కావడం లేదు. ఆ ట్వీట్‌లో పరమ శివుడిని కించ పర్చినట్లు ఎక్కడ ఉందో చెప్పండి? బీజేపీ పూర్తిగా దిగజారి వక్రీకరిస్తోంది. శివరాత్రి రోజు బీజేపీ వాళ్లు శివాలయాలకు వెళ్లడం మర్చిపోయినట్లు ఉన్నారు. అందుకే ఈరోజు 'కోవెలకు వెళ్దాం' అంటూ ధర్నాలు చేపట్టారు' అని వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు.

హిందుత్వానికి మీరు పేటెంటా?

మతాన్ని రాజకీయాల్లోకి ఎందుకు లాగుతున్నారు? హిందుత్వానికి చాంపియన్స్ అన్నట్టు బిల్డప్ ఇస్తున్నారు. మీకన్నా హిందుత్వంపై ఎక్కువ ప్రేమ ఉన్నవారు, హిందుత్వ సంప్రదాయాలు పాటించే వారు వైఎస్సార్‌సీపీలో కోట్లాది మంది ఉన్నారు. 2014లో చంద్రబాబు విజయవాడ నడిబొడ్డున 40 ఆలయాలు పడగొడితే ఏం పీకారు? ఆ ప్రభుత్వంలో భాగమైన మీరు ఆ రోజు ఒక్క ధర్నా చేశారా? టీడీపీ హయాంలో రాష్ట్రంలో ఎన్ని గుళ్లు కట్టారో.. ఈ మూడున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ హయాంలో ఎన్ని గుళ్లు కట్టారో, ఎన్నింటిని పునర్నిర్మించారో చూడండి. బీజేపీ నాయకుడు సునీల్ థియోధర్ ట్వీట్ ఇన్సల్టింగ్‌గా ఉంది. అటువంటి వ్యక్తితో రాజకీయం చేస్తే ఇంకా దిగజారిపోతారు.

– కురసాల కన్నబాబు, మాజీ మంత్రి

నాడు గుడులు కూల్చినప్పుడు ఏమయ్యారు?

మతానికి రాజకీయ రంగు పులిమి పబ్బం గడుపుకుంటున్న దుర్మార్గ పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక బీజేపీ మాత్రమే. ఓ సదుద్దేశంతో ట్విట్టర్‌లో వచ్చిన ఒక చిన్న క్యారికేచర్‌ను పట్టుకుని వక్ర భాష్యాలు వల్లిస్తూ రెచ్చిపోవడం బీజేపీ రాష్ట్ర నేతల దిగజారుడుతనానికి నిదర్శనం. మీరు టీడీపీతో అంటకాగినప్పుడు రాష్ట్రంలో 40 గుళ్లు కూల్చారు. అప్పుడు దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న బీజేపీ నేత, ఇతర నేతలంతా ఎక్కడ నిద్రపోయారు?

– కొట్టు సత్యనారాయణ, డిప్యూటీ సీఎం



కన్నబాబు, కొట్టు సత్యనారాయణ, బొత్స

ఇందులో తప్పేముంది?

రాష్ట్రంలో బీజేపీ నాయకులు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి. మేమంతా హిందువులమే. ఆ ట్వీట్ ద్వారా మా మనోభావాలు ఏమీ దెబ్బతిన లేదు. బీజేపీ వాళ్లకు ఏం ఇబ్బంది కలిగిందో అర్థం కావటం లేదు. ఆకలి అంటే దేవుడిని తలుచుకోవడం అందరికీ సహజం. రాష్ట్రంలో మనుగడ కోసం ఏమీ లేని చోట బీజేపీ మసిపూసి మారెడికాయ చేస్తోంది. గతంలో వారే దేవాలయాలు కూల్చి వారే ధర్నాలు, నిరసనలు చేశారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి.

– బొత్స సత్యనారాయణ, విద్యా శాఖ మంత్రి

బీజేపీ దిష్టికళ్లతో చూడటం మానాలి

అన్నార్తులకు అన్నం పెడితే, దాన్ని కూడా మతం దృష్టిలో చూసే దిష్టి కళ్లు బీజేపీవి. దేవుళ్లను రాజకీయాలకు వాడుకునే బీజేపీకి భక్తి గురించి ఏ మాత్రం తెలియదు. ఇలాంటి విషయాన్ని రాజకీయం చేయడం దుర్మార్గం.

– బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి

కళాశాల మెట్లు కూలి విద్యార్థులకు గాయాలు

సూర్యాపేటలోని భవిత జూనియర్ కళాశాలలో ఘటన



కూలిన భవిత జూనియర్ కళాశాల మెట్లు

సూర్యాపేటటౌన్: కళాశాల భవనం మెట్లు కూలి పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. జిల్లా కేంద్రంలోని 60 ఫీట్ల రోడ్డులో ఉన్న భవిత జూనియర్ కళాశాలలో 100 మంది వరకు విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నారు. భవనం కింది భాగంలో తరగతులు, పై అంతస్తులో హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగానే సాయంత్రం స్టడీ అవర్స్ అయిపోగానే విద్యార్థులు ఎవరి రూమ్‌కు వారు వెళ్లిపోయారు. కాగా, శివాజీ జయంతి ఉత్సవాల నిర్వాహకులు రోడ్డుపై ర్యాలీ నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఒక్కసారిగా హాస్టల్ రూమ్‌ల నుంచి బయటకు వచ్చి మొదటి అంతస్తు మెట్లపై నిలబడి చూస్తున్నారు. అయితే ఆ భవనం శిథిలావస్థలో ఉండటంతో మెట్లు కూలి సైడ్‌వాల్ ఒకవైపు ఒరిగిపోయింది. దీంతో 12 మంది విద్యార్థులు ఒకరిపై ఒకరు కిందపడిపోయారు. అక్కడ ఉన్న సిబ్బంది, తోటి విద్యార్థులు.. గాయపడిన విద్యార్థులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, చికిత్స పొందుతున్న విద్యార్థులను ఆదివారం రాత్రి మంత్రి జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. తీవ్ర గాయాలైన వారికి వెంటనే మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


24న కాంట్రాక్ట్ వైద్య పోస్టులకు ఇంటర్వ్యూలు

- 22తో ముగియనున్న దరఖాస్తుల ఆన్‌లైన్



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ని వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 25 స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఈ నెల మొదటి వారంలోనే యాజమాన్యం నోటిఫికేషన్ విడుదల చేసింది. 15 నుంచి 22వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్(పా) ఎన్.బలరామ్ సమక్షంలో ఈనెల 24న ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు. నియమితులైన వైద్యులకు నెలకు రూ.1.25 లక్షల వేతనం చెల్లించనుండగా, కనీసం సంవత్సరం పాటు పని చేసేలా ఒప్పందం ఉంటుందని, కంపెనీ వ్యాప్తంగా ఏ ఆస్పత్రిలోనైనా పని చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. ఇందులో అనస్తీషియా 2, చెస్ట్ ఫిజీషియన్ 1, ఈఎన్‌టీ సర్జన్ 2, ఆప్తమాలజిస్ట్ 3, పీడియాట్రీషియన్ 2, రేడియాలజిస్ట్ 1, జనరల్ సర్జన్ 2, గైనకాలజిస్ట్ 4, హెల్త్ ఆఫీసర్ 3, ఆర్థో సర్జన్ 2, ఫిజీషియన్ 4 పోస్టులు భర్తీ చేయనున్నట్లు వివరించారు.

కిన్నెరసానిలో పర్యాటక సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి ఆదివారం అధిక సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు. దీంతో ప్రాజెక్టు పరిసరాలు సందడిగా మారాయి. పర్యాటకులు డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. 378 మంది పర్యాటకులు తరలిరాగా తద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.13,565 ఆదాయం లభించింది. 250 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.18,220 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

సందర్శించిన టీఎస్ఎఫ్‌డీసీ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు

కిన్నెరసానిని ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు రాజ్‌కుమార్ సందర్శించారు. జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఆయన వెంట యానంబైల్ బీట్ ఆఫీసర్ రవి ఉన్నారు.

జిల్లా వార్తలు

వలసొచ్చి.. అండగా నిలిచి !

- రైతులకు ఆసరాగా ఉంటున్న వలస కూలీలు
- పొలాల్లో పనులకు ఏటా వేలాది మంది రాక
- ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వస్తున్న ఆదివాసీ, గిరిజనులు
- మిరప తోటలు, ఇతర పనుల్లో చేదోడు వాదోడుగా..



జూలూరుపాడు మండలం గుండెపుడిలో మిర్చి కోస్తున్న వలస కూలీలు

జూలూరుపాడు: ఉపాధి అవకాశాలు లేక... పని చేసే మార్గం లేక ఏటా తెలంగాణకు సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది ఆదివాసీ గిరిజనులు వలస వస్తున్నారు. వీరితో పాటు రాష్ట్రంలోని కుమురం భీం తదితర జిల్లాల నుంచి కూడా నిరుపేద గిరిజన కుటుంబాలు ఉపాధి కోసం భద్రాద్రి జిల్లాకు రావడం అనవాయితీగా మారింది. ఇక్కడ పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుండడంతో వ్యవసాయ పనులకు ఢోకా లేకపోగా.. స్థానికంగా మిర్చి ఏరడం, ఇతర పనులకు కూలీల కొరతతో వలస కూలీల రాకతో ఇరువర్గాలకూ మేలు జరుగుతోంది.

వేలాది ఎకరాల్లో మిర్చి సాగు..

ఉమ్మడి ఖమ్మం జిల్లా మిర్చి సాగుకు పెట్టింది పేరు. ఇక్కడి నేలలు, వాతావరణం కారణంగా నాణ్యమైన మిర్చి సాగు పెరుగుతుండగా డిమాండ్ కూడా ఉంటోంది. ఇలా వేలాది ఎకరాల్లో మిర్చి సాగవుతుండగా కోతకు వచ్చిన సమయంలో కూలీల కొరత రైతులను వేధిస్తోంది. దీంతో మిర్చి కోసేందుకు కూలీల కొరతతో ఇబ్బంది పడుతున్న రైతులకు వలస కూలీలు అండగా నిలుస్తూ జీవనోపాధి పొందుతున్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం వచ్చిన వలస కూలీలను రైతులు అక్కున చేర్చుకుంటుండడం విశేషం. స్వస్థలాల్లో ఉపాధి దొరకక, చేతిలో చిల్లిగవ్వ లేక భార్యాపిల్లలతో పస్తులు ఉండడానికి మనసొప్పక వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు వలస కూలీలు వస్తున్నారు. ఏటా మిరప సీజన్‌లో కూలీలు రావడం ఆనవాయితీగా మారడంతో కొందరు రైతులు నేరుగా ఫోన్ చేసి పిలిపించుకుంటున్నారు. మరికొందరు ఇక్కడికి వచ్చాక ఉపాధి వెతుక్కుంటున్నట్లు చెబుతున్నారు.

అడ్డురాని భాష, సంస్కృతి

ఆదివాసీ గిరిజనులకు కోయ భాష తప్ప మరే భాష రాకపోగా, మహారాష్ట్ర కూలీలకు మరాఠీ, హిందీ, మధ్యప్రదేశ్ కూలీలకు హిందీ తప్ప తెలుగు బాష రాదు. ఇది ఇక్కడి రైతులకు కాస్త ఇబ్బందే అయినా పని విషయంలో ఆదివాసీలు, గిరిజనులకు ఢోకా లేని కారణంగా అక్కున చేర్చుకుంటున్నారు. పంట పొలాల చెంతనే గుడారాలు వేయించి కరెంట్, తాగు నీరు ఇతర వసతులు కల్పిస్తున్నారు. ఇక పిల్లాపాపలతో ఉండే వలస కూలీలు ఉదయం ఆరు గంటలకు పని మొదలుపెట్టి సాయంత్రం వరకు మిరప తోటల్లోనే గడుపుతారు. దీంతో మిర్చి ఏరడం త్వరగా పూర్తవుతుండడం రైతులకు కలిసొస్తోంది.

అన్నం, మిరప పచ్చడి

ఆదివాసీ, గిరిజనులు ఆహారం విషయంలో ఆడంబరాలేమీ కోరుకోరు. దొడ్డు బియ్యం అన్నంలోకి మిరపకాయలను పచ్చడి చేసుకోవడంతో పాటు అంబలి (గంజి), నిప్పుపై కాల్చిన మిరపకాయలు, చింతపండు, నీళ్లు కలిపి చేసే పులుసునే ఆహారంలోకి తీసుకుంటారు. గత తొమ్మిదేళ్లుగా ఏటా జనవరిలో మిర్చి కోతలకు వచ్చే ఆదివాసీ గిరిజన, నిరుపేదలు ఏప్రిల్ చివరి వారంలో తిరిగి స్వరాష్ట్రాలకు బయలుదేరతారు.



వంట తయారు చేసుకుంటున్న దృశ్యం

అందుకే వలస కూలీలపై ఆధారం



ఇక్కడ కూలీల కొరత కారణంగానే ఐదేళ్లుగా వలస కూలీలపై ఆధారపడాల్సి వస్తోంది. ఇతర రాష్ట్రాల కూలీలు ఏటా ఇక్కడకు వస్తున్నారు. పంట పొలాల్లోనే వారికి కరెంట్, తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పిస్తాం. కూలీల కుటుంబాలకు బియ్యం, ఇతర సరుకులు కూడా ఇచ్చి మంచీచెడు చూస్తాం.

-గాదె కృష్ణయ్య, గుండెపుడి, జూలూరుపాడు మండలం

కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం



ఈ ఏడాది వంద మంది మహారాష్ట్ర కూలీలతో మిర్చి కోయిస్తున్నాం. కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఈ ఏడాది ఎకరం రూ.55 వేల చొప్పున 10 ఎకరాలు కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశా. కానీ వైరస్‌తో పంట దెబ్బతిన్నది. ఈ ఏడాది పెట్టుబడి వచ్చినా లాభం ఉండకపోవచ్చు.

-బి.పుల్లారావు, అనంతారం, జూలూరుపాడు మండలం

వలస కూలీలు రాకపోతే ఇబ్బందే...



వలస కూలీలు రాకపోతే మిరపకాయలు తోటల్లోనే ఉంటాయి. రెండేళ్లుగా మహారాష్ట్ర కూలీలు మిర్చి కోతలకు వస్తున్నారు. తెలుగు మాట్లాడటం రాకపోయినా ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రద్ధగా పనిచేస్తారు. కిలోకు రూ.10 చొప్పున ఇచ్చి మిర్చి కోయిస్తున్నాం.

-బానోత్ కిషన్, గుండెపుడి, జూలూరుపాడు మండలం

పనులు లేక మిర్చి కోతలకు వచ్చాం



మధ్యప్రదేశ్‌లో పనులు లేక మిర్చి కోతలకు వచ్చాం. ఏడాది అంతా పనులు దొరకక పోవడంతో తెలంగాణకు వచ్చాం. మా రాష్ట్రంలో అంతంత మాత్రంగా కూలీ దొరుకుతుంది. ఆ పనికి కూడా డబ్బు తక్కువ ఇస్తారు. మిర్చి కోతలయ్యే వరకు తోటల వద్దే గుడారాలు వేసుకుని ఉంటాం.

– మమత, మధ్యప్రదేశ్

ఐదేళ్లుగా వస్తున్నాం..



గత ఐదేళ్ల నుంచి మిర్చి కోతలు కోసేందుకు జూలూరుపాడు వస్తున్నాం. ఉపాధి కోసం భార్యా, బిడ్డలతో వచ్చాం. ఇక్కడి రైతులు మమ్మల్ని బాగానే చూసుకుంటున్నారు. మాకు తెలుగు రాకపోయినా పనిచేస్తాం. మూడు, నాలుగు నెలలు ఉండి మా రాష్ట్రానికి వెళ్లిపోతాం.

–సుభాష్ రాథోడ్, చంద్రాపూర్, మహారాష్ట్ర

ఉపాధి కోసం వచ్చాం



ఆసిఫాబాద్ జిల్లాలో పనులు దొరకకపోవడంతో ఉపాధి కోసం ఇక్కడకు వచ్చాం. మిర్చి కోతలు పూర్తయ్యాక ఊరు వెళ్తాం. ఉదయం 6నుంచి సాయంత్రం వరకు మిర్చి కోసి వస్తాం. కిలోకు రూ.10 చొప్పున రైతులు ఇస్తుండడంతో రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు వస్తాయి.

– ఎం.రతన్‌బాయి, కుమురం భీం జిల్లా

ఆటోమేటిక్ స్టార్టర్లు తొలగించాలి

ఎన్‌పీడీసీఎల్ ఏడీ కోక్యానాయక్



అనాసాగారంలో ఆటోమేటిక్ స్టార్టర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

నేలకొండపల్లి/కూసుమంచి: వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో పంపుసెట్లకు అమర్చిన ఆటోమేటిక్ స్టార్టర్లను తొలగించాలని ఎన్‌పీడీసీఎల్ కూసుమంచి ఏడీ కోక్యానాయక్ కోరారు. ఆదివారం ఆయన నేలకొండపల్లి మండలం అనాసాగారం, ముజ్జుగూడెంతో పాటు కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఆటోమెటిక్ స్టార్టర్లను తొలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ నిరంతరం అందిస్తున్న క్రమంలో కరెంట్‌కు ఇబ్బంది లేదన్నారు. కూసుమంచి డివిజన్ పరిధిలో మొత్తం 20,071 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. వీటివల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై భారం పడుతుందని, ఖర్చు భారీగా పెరుగుతుందని చెప్పారు. విద్యుత్ వృథాను అరికట్టేందుకు రైతులు సహకరించాలని కోరారు. మోటార్లు వాడే ప్రతీ రైతు తప్పకుండా సరైన రేటింగ్ కలిగిన కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది ద్వారా రైతులకు సమాచారం అందించి స్వచ్ఛందంగా వారే తొలిగించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేలకొండపల్లి ఏఈ కె.రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ నామ విస్తృత పర్యటన



కల్లూరులో మాట్లాడుతున్న ఎంపీ నామా నాగేశ్వరరావు

కల్లూరు/జూలూరుపాడు: బీఆర్ఎస్ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఆదివారం కల్లూరు, జూలూరుపాడు మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. కల్లూరులో ప్రజాహిత బ్రహ్మకుమారి ఈశ్వరీయా విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారి మహేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగ దర్శనం, వాయు శివలింగం దర్శనం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి పాల్గొన్నారు. సీహెచ్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఓ బారసాలకు హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. కప్పలబంధంలో ఇటీవల మృతి చెందిన గుర్రాల లక్ష్మారెడ్డి, లక్కిరెడ్డి రామిరెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. చంద్రుపట్లలోనూ పలువురిని పరామర్శించారు. జూలూరుపాడు మండలం గుండెపుడిలో ఇటీవల మృతిచెందిన జర్నలిస్టు కొళ్లూరు యతిరాజ్ కుమార్ కుటుంబాన్ని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్‌తో కలిసి పరామర్శించారు. యతిరాజ్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన గాదె సురేష్ ఇటీవలమృతి చెందగా, ఆయన కుటుంబీకులను ఓదార్చారు. వైస్ ఎంపీపీ గాదె నిర్మల, గాదె కృష్ణయ్య దంపతుల కుటుంబాన్ని పరామర్శించారు. వెంగన్నపాలెంకు చెందిన భోగిన్ని చిన్న కేశవులు ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి, భరోసా కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, ఎంపీపీ బీరవల్లి రఘు, కల్లూరు జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, బీఆర్ఎస్ కల్లూరు, జూలూరుపాడు మండలాల అధ్యక్షులు పాలెపు రామారావు, పొన్నెకంటి సతీష్‌కుమార్, జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, నాయకులు యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు గోపాలక్రిష్ణ, కొమ్మినేని కృష్ణమూర్తి, రోకటి సురేష్, కొమ్మినేని పాండురంగారావు, వేల్పుల నరసింహారావు, ఎదళ్లపల్లి వీరభద్రం, సర్పంచ్‌లు బానోత్ నరసింహారావు, గలిగె సావిత్రి, లావుడ్యా కిషన్‌లాల్, ధరావత్ రోజా, భూక్యా రాములు, బోడా భోజ్యా నాయక్, చౌడం నరసింహారావ తదితరులు పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు బెల్టుల ప్రదానం

ఖమ్మం స్పోర్ట్స్: నగరంలోని పీవీ నర్సింహారావు పార్కులో ఆదివారం 58 మంది కరాటే విద్యార్థులకు బెల్టులు ప్రదానం చేశారు. ఇందులో 32 మంది మందికి ఎల్లో, 10 మందికి నారింజ, ఆకుపచ్చ, ఐదుగురికి నీలం, పార్పుల్ 2, బ్రౌన్ బెల్ట్ ఒకటి అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాపర్తి శరత్, ఖాసీం, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు. ఈ బెల్టులు పొందిన వారిలో నగరంలోని శ్రీచైతన్య, రెజొనెన్స్ పాఠశాలల విద్యార్థులు ఉన్నారు.